బల్దియా ఆదాయం పెంపుపై దృష్టి పెట్టండి

- రోడ్డు ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించాలి
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్


సమీక్షలో పాల్గొన్న అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సొంత ఆదాయ వనరులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పలు శాఖల పనితీరుపై సోమవారం జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఏమేరకు ఆదాయం వస్తుంది, ఆదాయం పెరుగుదలకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని రెవెన్యూ, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ తదితర విభాగాల అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో.. అధికారుల పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సరైన నివేదికల్లేకుండా ఎలా పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో 100 శాతం ప్రాపర్టీ ట్యాక్స్, నల్లా ట్యాక్స్ రెగ్యులర్‌గా వసూలు చేయాలని, అనధికార ప్రచార ఫ్లెక్సీలు గుర్తించడంతో పాటు ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రెస్‌ల ద్వారా బల్దియాకు అడ్వర్టయిజ్‌మెంట్ పన్ను వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ఆక్రమణల వివరాలపై నివేదిక సమర్పించాలని, రోడ్లను ఆక్రమిస్తూ నూతన నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, రోడ్డు ఆక్రమణలపై తీసుకున్న చర్యలపై ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీకి చెందిన వాణిజ్య దుకాణాల కిరాయి సొమ్ము రెగ్యులర్‌గా వసూలు చేయాలని, నల్లాల లీకేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పారిశుధ్య నిర్వహణకు ప్రథమ ప్రాధాన్యం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డంపింగ్ యార్డు స్థలాన్ని ఎంపిక చేసి, ఫెన్సింగ్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జనావాసాల వద్దకు చెత్త సేకరించే వాహనాలు నిర్దేశిత సమయంలో తప్పనిసరిగా వెళ్లాలని, బయట చెత్త వేయకుండా చూడాలని అన్నారు. ప్రతి ఇంటి వద్ద నుంచి చెత్తను సేకరించడంతో పాటు వాణిజ్య ప్రదేశాలు, కల్యాణ మండపం, షాదీఖానా తదితర ప్రాంతాలను ఎంపిక చేసుకొని చెత్త నిర్వహణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

సమావేశాలు నిర్వహించాలి

మున్సిపల్ కార్పొరేషన్ పనితీరుపై ఎప్పటికప్పుడు మున్సిపల్ కమిషనర్ రివ్యూ సమావేశాలు నిర్వహించాలని, లోపాలను గమనిస్తూ వాటిని సవరించే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ పనితీరుపై మరోసారి నిర్వహించే సమావేశం లోగా రోడ్డు ఆక్రమణలు, ప్రాపర్టీ టాక్స్ వసూలు, ప్రచార ఫ్లెక్సీల నుంచి వచ్చే ఆదాయం, నీటి పన్ను, చెత్త నిర్వహణ వంటి అంశాలపై సంపూర్ణ నివేదిక సమర్పించాలన్నారు. ప్రజల జీవన విధానం సజావుగా సాగేందుకు, నిర్దేశిత సేవలు పకడ్బందీగా అందేలా మున్సిపల్ సిబ్బంది విధులు నిర్వహించాలని, ప్రణాళిక ప్రకారం పట్టణ అభివృద్ధి జరగాలని అన్నారు. రామగుండం మున్సిపల్ కమిషనర్ సి.హెచ్.నాగేశ్వర్, తహసీల్దార్ కుమారస్వామి, డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, ఎస్ఈ చిన్నారావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో కృపాభాయి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

అయ్యప్ప స్వాములకు భిక్ష


పూజలు చేస్తున్న బిరుదు సమత

సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రినగర్ ఆంజనేయస్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత భిక్ష వడ్డించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రకాష్‌రావు దంపతులు భిక్ష ఏర్పాటు చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరి మహేందర్, మాజీ సర్పంచ్ సాయిరి పద్మ పాల్గొన్నారు.

స్వామివారికి పూజలు


రుద్రాభిషేకం చేస్తున్న శ్రీనివాస్

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో వ్యాపారి బొడ్ల శ్రీనివాస్ దంపతులు స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. సోమవారం పలువురు వ్యాపారులు, ప్రజలు, భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి క్షీరాభిషేకం నిర్వహించారు. తీర్థప్రసాదాలను పూజారి రమేశ్, మహేశ్ అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షురాలిగా తిరుపతమ్మ


తిరుపతమ్మ

గోదావరిఖనిటౌన్: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా రేషన్ డీలర్ల సంఘం నూతన అధ్యక్షురాలిగా మామిడి తిరుపతమ్మఅంకూస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన రేషన్ డీలర్ల సమావేశంలో డీలర్లు ఆమెను ఎన్నుకున్నారు. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన రేషన్ డీలర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

సుల్తానాబాద్‌రూరల్: మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని సీఐ జగదీష్ అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలో సోమవారం రాత్రి ఆకస్మిక వాహనాల తనిఖీ నిర్వహించారు., సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు, ఒక కారును సీజ్ చేయడంతో పాటు 97 ఇ–చలాన్స్ కట్టని, 9 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేశారు. ఎస్సైలు విజేందర్, వెంకటకృష్ణ, శ్రీనివాస్, శ్రీధర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపల్లి నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి బాల్‌రెడ్డి కోరారు. సోమవారం హైదరాబాద్‌లో జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సాల్‌ను కలిసి కోరినట్లు తెలిపారు. నాయకులు వేణు, లక్ష్మణ్ ఉన్నారు.

బడిలో చేరిన డ్రాపౌట్ విద్యార్థి


పాఠశాలలో విద్యార్థిని చేర్పిస్తున్న రామ్‌కుమార్

జ్యోతినగర్: బడి బయటి పిల్లల సర్వేలో భాగంగా హాస్టల్ వాతావరణం ఇష్టం లేక ఇంటి వద్దే ఉంటున్న డ్రాపౌట్ విద్యార్థిని క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ రామ్‌కుమార్ గుర్తించారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో 8వతరగతిలో చేర్పించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు జయరాజ్, సమద్ పాల్గొన్నారు.

వేములవాడకు కాంగ్రెస్ నాయకుడి పాదయాత్ర


అడవిశ్రీరాంపూర్‌లో పాదయాత్ర ప్రారంభించిన రాజయ్య

ముత్తారం: అడవిశ్రీరాంపూర్‌కు చెందిన కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య సోమవారం గ్రామం నుంచి వేములవాడకు పాదయాత్రను ప్రారంభించారు. మంథని ఎమ్మెల్యేగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గెలుపొందారని, గ్రామం నుంచి వేములవాడ రాజన్న మొక్కును చెల్లించేందుకు పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. పాదయాత్రను మాజీ జెడ్పీటీసీ, జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు వజీద్‌పాషా, స్థానిక నాయకులు జెండా ఊపి ప్రారంభించారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్



పెద్దపల్లిరూరల్: మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి జాహెద్, సినాదుద్దీన్, జియా అహ్మద్, అక్రమ్, రహీం తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

రామగిరి: సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత, ప్రకృతి వైద్య నిపుణురాలు డా.శరణ్యకు సోమవారం కల్వచర్ల సర్పంచ్ గంట పద్మ ఆత్మీయ సన్మానం నిర్వహించారు. వివిధ సేవా రంగాల్లో సేవలందించినందుకు గాను ఈనెల 3న హైదరాబాద్‌లో మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గంట వెంకటరమణారెడ్డి, అనవేని కుమార్, ఆసం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపుతోనే అవార్డు

సుల్తానాబాద్: వాసవి వనిత క్లబ్ చేసిన సేవలను గుర్తించి అవార్డును అందించడం శుభపరిణామమని వాసవి వనిత క్లబ్ 3వ రీజియన్ చైర్‌పర్సన్ ఎల్లంకి రాజన్న అన్నారు. సోమవారం కరీంనగర్‌లో వాసవి వనిత క్లబ్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొనగా.. 2023 సంవత్సరంలో చేసిన సేవలను గుర్తించి అవార్డును వాసవి వనిత క్లబ్ గవర్నర్ చంద్రశేఖర్ అందజేసినట్లు తెలిపారు. కాసం సత్యనారాయణ, అప్పల శ్రీధర్, అక్కినపల్లి నాగరాజు, లింగమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల బిల్లులు అందజేత

పాలకుర్తి: బామ్లానాయక్‌తండాలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు సోమవారం బిల్లులు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొత్తం 22 మంది లబ్ధిదారులకు రూ.12వేల చొప్పున రూ.2.64లక్షలను గ్రామ సర్పంచ్ బదావత్ రాజునాయక్ అందజేశారు.

గడపగడపకూ శ్రీరాముడి అక్షింతలు


సుల్తానాబాద్‌లో అక్షింతలతో శోభాయాత్ర


మియ్యాపూర్‌లో..

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీవేణుగోపాల స్వామి దేవాలయం నుంచి అయోధ్య రాముల వారి అక్షింతలను ఇంటింటా పూజారి సామిత్రి శ్రావణ్‌కుమార్ అందజేశారు. పూసాల రోడ్డు, పాత జెండా, శివాలయం, పోలీస్ స్టేషన్ మీదుగా ఇంటింటికి అక్షింతలను ప్రత్యేక పూజలు నిర్వహించి అందజేశారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత హాజరయ్యారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు వోల్లాల అంజయ్య, కొమురవెల్లి రవీందర్, కొమురవెల్లి హరీష్, వోల్లాల రాజు ఇంటింటికి అక్షింతలు పంపిణీ చేశారు. శివాలయంలో పూజారులు వల్లకొండ మహేశ్, రమేశ్ ప్రత్యేక పూజలు చేశారు. శివాలయం చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, వాసవి మాత దేవాలయం చైర్మన్ చకిలం మారుతి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో..

పాలకుర్తి: పుట్నూర్, బసంత్‌నగర్ సమీపంలోని కురుమపల్లి గ్రామాల్లో శ్రీరాముడి జన్మభూమి అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు. పున్నం సాగర్, వేల్పుల రాజ్‌కుమార్, తోట ప్రశాంత్, బత్తిని చంటి, చిప్ప శ్రీనివాస్, భూతగడ్డల నర్సయ్య, బీటి శేఖర్, కడారి హరీష్, గొర్రె రమేశ్, మూసరి స్వామి, పెండ్యాల ప్రశాంత్ పాల్గొన్నారు.

మియ్యాపూర్‌లో..

సుల్తానాబాద్‌రూరల్: మియ్యాపూర్ గ్రామంలో సోమవారం అయోధ్య అక్షింతలను సర్పంచ్ కొయ్యడ స్వప్న, ఎంపీటీసీ ఫక్కీర్‌యాదవ్ ఇంటింటా పంపిణీ చేశారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పొత్కపల్లిలో..

ఓదెల: పొత్కపల్లిలో ఇంటింటా అయోధ్య అక్షింతలను బీజేపీ నాయకుడు పుల్లూరి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. నాయకులు సిరిశేటి రాహుల్, శంకర్, తిరుపతిరెడ్డి, నిఖిల్, రాజు, రమేశ్, భువనదేవి పాల్గొన్నారు.

శోభాయాత్ర

కమాన్‌పూర్: గుండారం, పిల్లిపల్లె గ్రామాల్లో రాముడి అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

గోదావరిఖనిటౌన్: ఇటీవల పరకాలలో నిర్వహించిన 32వ చాంపియన్‌షిప్ కరాటే పోటీల్లో పట్టణంలోని స్పెక్ట్రా పాఠశాలకు చెందిన విద్యార్థులు గాలిపెల్లి జోసెఫ్, దాసరి చరిత్ ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్స్, కుసుమ అఖిల్ సిల్వర్ మెడల్ సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ న్యాతని సాయిలీల, డైరెక్టర్ శ్యామ్, విద్యార్థులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే విజయరమణారావు


జూలపల్లి: ఉద్యోగులను వివరాలడుగుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి: గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, సర్పంచులు పెండింగ్ బిల్లులపై ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా.. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభకు హాజరైన మండల స్థాయి అధికారుల వివరాలు, సమస్యలడిగి తెలుసుకున్నారు. సభకు రాని శాఖలకు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోకు సూచించారు. తేలుకుంటకు ఏఎన్ఎంను కేటాయించాలని సర్పంచ్ పద్మ కోరగా.. మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లు రావడం లేదని జూలపల్లి సర్పంచ్ నర్సింహయాదవ్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. జనరల్ ఫండ్ గురించి ఎమ్మెల్యే అడగగా.. ఆరు సంవత్సరాల నుంచి రాలేదని ఎంపీడీవో చెప్పారు. ఎమెల్యేను వెలుగు సమాఖ్య సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు శాలువాలతో సన్మానించారు. జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, ఎంపీడీవో వేణుగోపాలరావు, తహసీల్దార్ బషీరోద్దీన్, పీఏసీఎస్ అధ్యక్షుడు వేణుగోపాలరావు, వైస్ ఎంపీపీ రమేశ్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

హామీ అమలు చేస్తాం

తెలంగాణ ఆడబిడ్డలకు కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేసి తీరుతామని ఎమ్మెల్యే అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 19 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, తహసీల్దార్ బషీరోద్దీన్, ఎంపీడీవో వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సోమవారం కాట్నపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20లక్షలు, రూర్బన్ నిధులు రూ.10.40లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. సర్పంచ్ మోహన్‌రెడ్డి, ఎంపీపీ బాలాజీరావు, జెడ్పీటీసీ స్వరూపరాణి, ఎంపీడీవో శశికళ, పీఆర్ ఏఈ సతీష్, ఉప సర్పంచ్ శేఖర్‌గౌడ్, ఎంపీవో ఫయాజ్‌అలీ, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు అడ్రస్

కాల్వశ్రీరాంపూర్: ప్రజా సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ పార్టీ అడ్రస్సని ఎమ్మెల్యే అన్నారు. సోమవారం కాల్వశ్రీరాంపూర్ తహసీల్ కార్యాలయం ఆవరణలో 32 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఎంపీపీ నూనేటి సంపత్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష, తహసీల్దార్ జాహెద్‌పాషా, సారయ్యగౌడ్, తులా మనోహర్‌రావు, గాజనవేన సదయ్య తదితరులు పాల్గొన్నారు.

జవాబుదారీతనంగా పని చేయాలి

సుల్తానాబాద్: ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీతనంగా పని చేస్తారని, అధికారులు సైతం అలాగే పని చేయాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సోమవారం ఎంపీడీవో సమావేశం మందిరంలో సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంపీపీ బాలాజీరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీవో శశికళ, జెడ్పీటీసీ మినుపాల స్వరూప, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఏఎంసీ చైర్మన్ బుర్ర మౌనిక, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామాల్లో రైతు వేదికల ఫండ్స్ లేక ఇబ్బందులు పడుతున్నారని, నిధులు కావాలని, మహిళలు అభయహస్తం డబ్బులు చెల్లించి వాటికోసం చూస్తున్నారని, వడ్డీతో సహా చెల్లించాలని సమావేశం తీర్మానం చేసి ఆమోదం తెలిపింది. జనవరి 30తో ముగుస్తున్న సర్పంచుల పదవీకాలం పొడిగించేలా చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

నియోజకవర్గాలు ఒకే జిల్లాలో ఉండాలి

అసెంబ్లీ నియోజకవర్గాలు ఒకే జిల్లాలో ఉండాలనే సంకల్పంతో కమిటీ వేశామని ఎమ్మెల్యే అన్నారు. సుల్తానాబాద్‌లో మండల సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. జిల్లాలు మార్పు చేస్తారని కొన్ని పత్రికల్లో కథనాలు వస్తున్నాయని, నమ్మొద్దన్నారు. పార్లమెంటు ఎన్నికలు ఫిబ్రవరి చివరి వారంలో లేదా మార్చి మొదటి వారంలో వచ్చే అవకాశాలున్నాయని, ఆ ఎన్నికలు అయిపోయిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలుండే అవకాశముందని తెలిపారు. సుల్తానాబాద్ జెడ్పీటీసీ మినుపాల స్వరూప, మాజీ సర్పంచ్ ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి

పనులు పూర్తి చేయాలి

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలో గతంలో ప్రతిపాదించిన పనులను పూర్తి చేయాలని, ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని జీఎం చింతల శ్రీనివాస్‌కు సోమవారం అధికారుల సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆర్జీ–1 అధికారుల సంఘం అధ్యక్షుడు పొనుగోటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు డా.మధుకుమార్, సీనియర్ పీవో శ్రావణ్‌కుమార్, ఎస్టేట్ అధికారులు బాలసుబ్రమణ్యం, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–2లో క్రీడా వార్షికోత్సవం

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియా సీఈఆర్ క్లబ్‌లో 31వ క్రీడా వార్షికోత్సవం వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ హాజరై క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన అఖిల్‌ను ఘనంగా సన్మానించారు. గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ జిగురు రవీందర్, ఎస్‌వోటూ జీఎం బచ్చ రవీందర్, పర్సనల్ డీజీఎం జి.రాజేంద్రప్రసాద్, డీవైపీఎం వేణుగోపాల్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

కోలిండియా పోటీలకు సీఈఆర్ క్లబ్ సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ: ఈనెల 10 నుంచి నాలుగు రోజుల పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఎస్ఈసీఎల్ కంపెనీ ఆధ్వర్యంలో బట్‌గావ్‌లో జరిగే కోలిండియా లాన్‌టెన్నిస్ పోటీలకు ఎంపికైన 8మందిలో ఏడుగురు యైటింక్లయిన్‌కాలనీ సీఈఆర్ క్లబ్‌కు చెందినవారు కావడం విశేషం. వీరిలో ఓసీపీ–1కు చెందిన కె.చంద్రశేఖర్‌రెడ్డి, మేరుగు శేఖర్, ఓసీపీ–3కి చెందిన బెక్కం రవి, ఎ.వెంకటేశ్వర్లు, వకీల్‌పల్లికి చెందిన సంజీవ్‌యాదవ్, అడ్రియాల ప్రాజెక్టుకు చెందిన శ్రీమన్నారాయణ, 11ఇంక్లయిన్‌కు చెందిన శౌధర్‌రెడ్డి, భూపాలపల్లి ఏరియాకు చెందిన వై.తిరుమల ఉన్నారు. ఈ జట్టుకు మేనేజర్‌గా మందమర్రి ఏరియాకు చెందిన సీనియర్ పర్సనల్ అధికారి కార్తీక్, కోచ్‌గా ఆర్‌జీ–1 స్పోర్ట్స్ సూపర్‌వైజర్ హెచ్.రమేశ్ వ్యవహరించనున్నారు.


ఎంపికైన సింగరేణి ఉద్యోగులు

నేషనల్ అవార్డుకు ఎంపిక

యైటింక్లయిన్‌కాలనీ: ప్రొఫెసర్ జయశంకర్ నేషనల్ అవార్డు–2024కు గాను కాలనీకి చెందిన విశ్వబ్రాహ్మణ సోషల్ ఆర్గనైజేషన్ జేఏసీ కన్వీనర్ నాగులమల్యాల రాజమౌళి ఎంపికైనట్లు అవార్డు సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ తెలిపారు. ఈ అవార్డును ఫిబ్రవరి 11న తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 7వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో అందజేయనున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని జాతీయ కార్యాలయంలో అవార్డు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

నేత్రదానం గొప్పదానం

కోల్‌సిటీ: అన్ని దానాల్లో కంటే నేత్రదానం గొప్పదని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అన్నారు. మెప్మా విభాగం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ బత్తుల రజిని తన మరణానంతరం నేత్రదానం చేస్తానని అంగీకారం తెలుపుతూ అంగీకార పత్రాన్ని సదాశయ ఫౌండేషన్‌కు సోమవారం అందించారు. రజిని నిర్ణయాన్ని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

త్వరలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

జ్యోతినగర్: విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు డీఈ శివరాములు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సోమవారం కార్పొరేషన్ ఐదో డివిజన్‌లోని పలు విద్యుత్ సమస్యలపై సూపరింటెండెంట్ సుదర్శనం ఆదేశాల మేరకు పర్యటించి తెలుసుకున్నారు. త్వరలోనే లోఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన ప్రాంతంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. రహీం, కుమార్, రమేశ్, సురేష్ పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకుల ఆందోళన


కేజీబీవీ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సుల్తానాబాద్‌రూరల్: భూపతిపూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం ఏబీవీపీ నాయకులు ధర్నా చేశారు. ఏడోతరగతి చదువుతున్న అమూల్య అనే విద్యార్థినిని శనివారం పాము కుట్టగా.. విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. రాసూరి ప్రవీణ్, రాజేశేఖర్, అజయ్, రిషి, శ్రీనివాస్, వినయ్, అరవింద్, సిద్ధార్థ, శివకుమార్, ఆకాష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థి ఏదో కుట్టిందని తెలపడంతో వెంటనే సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించామని కస్తూర్బాగాంధీ ప్రిన్సిపాల్ స్వప్న వివరణ ఇచ్చారు. వైద్యులు కూడా పాము కాటు కాదని నిర్ధారించారన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ వేగవంతం

ఓదెల: మండలంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ పనులు వేగవంతమయ్యాయి. సిబ్బంది ఆన్‌లైన్ పనుల్లో నిమగ్నమయ్యారు. 22 గ్రామాల్లో స్వీకరించిన దరఖాస్తులను తహసీల్, మండల పరిషత్ కార్యాలయాల్లో ఆన్‌లైన్ చేస్తున్నారు. ఎంపీడీవో సత్తయ్య, తహసీల్దార్ యాకన్న పనులను పర్యవేక్షిస్తున్నారు.

మానవత్వం చాటుకున్న వాకర్స్


నగదు అందజేస్తున్న వాకర్స్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వాకర్స్ ఆదర్శంగా నిలిచారు. ఏదో ఫిట్‌నెస్ కోసం ఉదయం, సాయంత్రం గ్రౌండ్‌లో వాకింగ్ చేసి ఎవరి దారిన వారు ఇంటికి పోలేదు. స్థానిక చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన బిల్ల బాపు అనే నిరుపేద దినసరి కూలీ ఇటీవల మృతిచెందాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన దుఃఖంతో ఆర్థిక ఇబ్బందుల్లో తల్లడిల్లుతున్న మృతుడి ఇద్దరు కూతుళ్లు, భార్య పరిస్థితిని తోటి వాకర్ ద్వారా విషయం తెలుసుకున్న సుమారు 40 మంది వాకర్స్ చలించిపోయారు. తలా కొంత పోగేసి రూ.1.30లక్షల వరకు నగదు సేకరించారు. బాపు కూతుళ్లకు రూ.60వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మిగిలిన రూ.10వేల నగదు, 25కిలోల బియ్యం స్టేడియంలో మృతుడి కుటుంబానికి అందజేశారు.

కుర్చీల వితరణ



పెద్దపల్లిరూరల్: పెద్దబొంకూర్‌లోని జెడ్పీ హైస్కూల్‌కు మిట్టపల్లి శంకరయ్య జ్ఞాపకార్థం సోమవారం కుర్చీలను మిట్టపల్లి శ్రీనివాస్ అందజేశారు. హెచ్‌ఎం సుదర్శన్, కలవేన రాజేందర్, రవి, తిరుపతి, అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



పెద్దపల్లిరూరల్: తుర్కలమద్దికుంట గ్రామానికి చెందిన జిల్లెల్ల బూదమ్మ ఇటీవల మరణించింది. నిరుపేద కుటుంబం కావడంతో లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో ఆమె కుమారులు కొమురయ్య, ప్రశాంత్‌కు రూ.8వేల నగదు, 50కిలోల బియ్యం సోమవారం అందించారు. అధ్యక్షుడు సాదుల వెంకటేశ్వర్లు, సభ్యులు రమేశ్, గంట్ల రాంచంద్రారెడ్డి, జైపాల్‌రెడ్డి, సత్యనారాయణ, ముత్యాల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదకు చేయూత

ఓదెల: కొమిర గ్రామంలో ఇటీవల బ్రెయిన్ ఆపరేషన్, పక్షవాతంతో బాధపడుతున్న నాగపూరి శ్రీనివాస్‌కు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తనయుడు వంశీకృష్ణ రూ.5వేలు పంపగా.. స్థానిక కాంగ్రెస్ నాయకుడు అల్లం సతీష్ సోమవారం అందజేశారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ


బ్యాగులు అందిస్తున్న రాజిరెడ్డి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం రెండో డివిజన్ న్యూపీకే రామయ్య కాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని శతాబ్ది, ప్లాన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని ఉమెన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ హనుమాన్ రాజిరెడ్డి స్కూల్ బ్యాగులను అందించారు. రెండో డివిజన్ కార్పొరేటర్ ఎన్వీ రమణారెడ్డి, లయన్స్ క్లబ్ గోదావరిఖని శతాబ్ది ప్రెసిడెంట్ కంకణాల ముకుందరెడ్డి, సెక్రటరీ బాలసాని స్వామిగౌడ్, ట్రెజరర్ దేవినేని శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని ఉమెన్ ప్రెసిడెంట్ బాలసాని పద్మగౌడ్, సెక్రటరీ ఏలేశ్వరం శ్రీలత, ట్రెజరర్ కంకణాల శ్రీదేవి, మడిపెల్లి మల్లేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.